పాల సంద్రం పూలే.. పూల సంద్రాలయ్యా

కొనసాగుతున్న పూల పండుగ

వేపకాయల బతుకమ్మ ఆడిన ఆడబిడ్డలు

వేంసూరు : బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న మహిళలు

తిరుమలాయపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

సత్తుపల్లి టౌన్ : హైదరాబాద్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి

చింతకాని/ తిరుమలాయపాలెం, అక్టోబర్ 8: తెలంగాణ సాంస్కృతిక ప్రతీక బతుకమ్మ వేడుకలు జిల్లాలో ఘనంగా కొనసాగుతున్నాయి. పూల పండుగ వేడుకలను ఆడబిడ్డలు వైభవంగా జరుపుకుంటున్నారు. ఏడో రోజూ వేపకాయల బతుకమ్మలతో ఆడిపాడారు. మంగళవారం సాయంత్రం సమయంలో తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను ఆడబిడ్డలందరూ కలిసి గ్రామ కూడళ్లలోకి తీసుకొచ్చారు. అన్నింటినీ అక్కడ ఉంచి వాటి చుట్టూ తిరుగుతూ కోలాటాలు వేస్తూ బతుకమ్మ పాటలు పాడారు. 'పాల సంద్రం పూలే.. పూల సంద్రాలయ్యా..నిన్ను అభిషేకించేనే..' అంటూ పాడిన ప్రతి ఒక్కరినీ అలరించాయి. రాత్రి అయ్యాక సమీపంలోని వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కొన్ని మండలాల్లో పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలోనూ బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.

బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 8: హైదరాబాద్‌లోని తెలంగాణ అసెంబ్లీ హాల్‌లో జరుగుతున్న బతుకమ్మ వేడుకల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మంగళవారం పాల్గొన్నారు. ఆలేరు ఎమ్మెల్యే సతీమణి బీర్ల అనిత, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

ఐకేపీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

వేంసూరు, అక్టోబర్ 8: ఐకేపీ ఆధ్వర్యంలో వేంసూరు ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఏటీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు బతుకమ్మలను రంగురంగు పూలతో సుందరంగా తయారు చేసి వాటిని ఒక చోట ఉంచి బతుకమ్మ పాటలు పాడుతూ అలరించారు.

ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ : కలెక్టర్

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, అక్టోబర్ 8 : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే బతుకమ్మ.. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఏడోరోజు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధశాఖల మహిళా అధికారులు, సిబ్బంది, ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి విక్రమ్‌సింగ్ సిదార్థ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 8 : అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆయా సెక్టార్లలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, హెల్పర్లు కేంద్రాలను అందంగా ముస్తాబు చేశారు. కేంద్రం అవరణలో ప్రత్యేకంగా ముగ్గులు వేసి చైల్డ్ లైన్-1098 టోల్ ఫ్రీని ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. కేంద్రాలకు తల్లులు, పిల్లలతోపాటు రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో బతుకమ్మలను ఉంచి పిల్లలతో ఆటాపాట నిర్వహించారు. నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది.

అంతర్జాతీయ ప్రమాణాలతో 'అంకుర'

- ఖమ్మం గొరిల్లా పార్క్ దగ్గర 120 పడకలతో ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి
- మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ రాకేష్ చల్లగుళ్ల

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అంకుర మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్

ఖమ్మం సిటీ, సెప్టెంబర్ 8 : అత్యుత్తమ, అధునాతన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలన్నీ ఒకేచోట కల్పిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఖమ్మం జిల్లా ప్రజలకు అంకుర ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చామని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ రాకేష్ చల్లగుండ్ల అన్నారు. మంగళవారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా మహిళలు, పిల్లలకు సంబంధించి చారిత్రక వైద్యాన్ని అందిస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. పేద, ధనిక, ఉన్నతవర్గాలను దృష్టిలో పెట్టుకుని తమ సేవలను మరింత విస్తృతపర్చాలనే లక్ష్యంతో ఆసుపత్రిని ఖమ్మం నగరంలోని గొరిల్లా పార్క్ ఎదురుగా విశాలమైన భవనంలోకి మార్చామన్నారు. అధునాతన సౌకర్యాలతో కూడిన 'అంకుర'ను బుధవారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయ, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నిమ్మల రామానాయుడు అతిథులుగా వస్తున్నట్లు పేర్కొన్నారు. 'అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్'కు దేశవ్యాప్తంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాల్లోని మొత్తం 14 కేంద్రాలున్నాయన్నారు. వాటన్నిట్లో మొత్తం 1,800 పడకలుండగా, ఖమ్మంలో 120 పడకలతో అధునాతన ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు.

మొదటిసారిగా ఫెర్టిలిటీ సౌకర్యం..

నెలలు నిండకుండా పుట్టిన, నవజాత శిశువులకు అవసరమైన అత్యవసర వైద్యసేవలకు గాను ఖమ్మంలో తొలిసారిగా 24 పడకల ఎన్ఐసీయూ(పిడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్), 18 పడకల పీఐసీయూ(పిడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) తమ అంకుర ఆసుపత్రిలో ఉన్నదని డాక్టర్ కృష్ణప్రసాద్ తెలిపారు. అదేవిధంగా మొదటిసారిగా 9ఎం ఫెర్టిలిటీ సౌకర్యాన్ని సైతం ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ఇన్‌ఫెర్టిలిటీ నివారణ దంపతులకు ఇదో వరంగా మారనుందన్నారు. చైల్డ్-ఫ్రెండ్లీ, మహిళలు, గర్భిణులకు ప్రశాంతమైన వైద్యసేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రసవాల కోసం వచ్చే వారికి విలాసవంతమైన, సౌకర్యవంతంగా ఉండే సూటు రూమ్‌లు, పిండం సంరక్షణ, అధిక నాణ్యత కలిగిన ప్రినేటల్, పెరినాటల్ కేర్ వసతులు తమ అంకుర ఆసుపత్రిలో ఉన్నాయన్నారు. చైల్డ్ బర్త్ తరగతులు, గర్భిణులకు యోగా, ఆహారం, బ్రెస్ట్ ఫీడింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. నొప్పి లేకుండా ప్రసవం, వాటర్ బర్త్(సహజ ప్రసవం), సిజేరియన్ వంటి అన్నిరకాల సేవలను మహిళల వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా నిపుణుల సంరక్షణలో అందిస్తామన్నారు. పిడియాట్రిక్, ప్రసూతి, గైనకాలజీ విభాగాల్లో నిపుణులైన వైద్యులు, శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్, ఫార్మసీ 24గంటలపాటు అందుబాటులో ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అంకుర ఆసుపత్రి డాక్టర్లు దుర్గాప్రసాద్, సందీప్‌రెడ్డి, స్పందన, పూజ, శ్రీనిధి పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా 'కల్యాణలక్ష్మి'

చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి

కూసుమంచిలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపి చేస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి

కూసుమంచి, అక్టోబర్ 8: గ్రామాల్లో పేదింటి ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం రాజకీయాలకు అతీతంగా అర్హత గల ప్రతి ఒక్కరికీ అమలుచేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో 40 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ ముప్వా విజయ్‌బాబులతో కలిసి కూసుమంచిలోని తన కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజల సమస్యలను అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, ఆర్డీవో గణేశ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, నాయకులు స్వర్ణకమారి, మార్కెట్ చైర్మన్ సీతారాములు, రవికుమార్, గోపాల్‌రావు, వెంకటరెడ్డి, శ్రీనివాస్, రాంరెడ్డి, సుధకార్‌రెడ్డి, రమేశ్, మట్టె గురవయ్య, హఫీజుద్దీన్, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, కొప్పుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రతి కుటుంబానికీ డిజిటల్ కార్డులు: పొంగులేటి

తిరుమలాయపాలెం, అక్టోబర్ 8: త్వరలోనే ప్రతి కుటుంబానికీ డిజిటల్ కార్డులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. డిజిటల్ కార్డుల్లో కుటుంబ వివరాలన్నీ పొందుపరుస్తామని అన్నారు. ఇప్పటివరకు రుణమాఫీ జరగని అర్హులైన రైతులందరికీ తప్పనిసరిగా రుణమాఫీ చేస్తామన్నారు. మరో నెల రోజుల్లో నిరుపేదలకు మొదటి విడతగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. జల్లేపల్లిలోని అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో గణేశ్, ఇతర అధికారులు వెంకటరెడ్డి, రామకృష్ణ, శిలార్ తదితరులు పాల్గొన్నారు.

కాన్వాయ్ నిలిపి.. క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 8: మరో క్షతగాత్రుడికి మంత్రి పొంగులేటి ఆపన్న హస్తం అందించారు. కొద్ది నెలల క్రితం ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల వద్ద ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడిని గమనించిన మంత్రి.. వెంటనే తన కాన్వాయ్‌ని నిలిపి.. క్షతగాత్రుడిని సకాలంలో ఆసుపత్రికి పంపించిన పొంగులేటి.. తాజాగా మంగళవారం మరొకరికీ ఆపన్న హస్తం అందించారు. తిరుమలయపాలెం పర్యటన ముగించుకొని ఖమ్మం వస్తున్న మంత్రి పొంగులేటి.. కరుణగిరి ప్రాంతానికి చేరుకున్నారు. ఆ సమయంలోనే అక్కడ ఓ బైకు, కారు ఢీకొన్నాయి. ద్విచక్రవాహనదారుడికి తీవ్రంగా గాయాలైన విషయాన్ని గమనించి మంత్రి.. వెంటనే తన కాన్వాయ్‌ని ఆపి.. క్షతగాత్రుడి దగ్గరకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటికే ట్రాఫిక్ జామ్ కావడంతో తన ఎస్కార్ట్ వాహనంలోనే అతడిని హుటాహుటిన ఖమ్మంలోని కిమ్స్ వైద్యశాలకు తరలించారు.

ఆరో రోజుకు దేవీ శరన్నవరాత్రులు

వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు

చింతకాని : రామకృష్ణాపురంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఎర్రుపాలెం/ చింతకాని/ కూసుమంచి (నేలకొండపల్లి), అక్టోబర్ 8: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం పలు మండపాల్లో వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మన్యసూక్త హోమం నిర్వహించారు. ఇక్కడి అమ్మవారు శ్రీలలితా పరమేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ బాధ్యులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 300 మంది స్వామి వారి అన్నప్రసాదం సేకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ పర్యవేక్షకులు కే.విజయకుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు మురళీ మోహనశర్మ తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లి మండలంలోని దుర్గామాత ఆలయాల్లోని అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చింతకాని మండలంలో కనకదుర్గ అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించిన డీటీవో

మాట్లాడుతున్న డీటీవో శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 8: రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయాన్ని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ పీ.శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ తనిఖీల్లో భాగంగా కార్యాలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను పరిశీలించారు. సత్తుపల్లి, కల్లూరులోని కార్యాలయం చెక్ పోస్టులకు ప్రభుత్వ స్థలాలు మంజూరు చేస్తే భవన నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటరమణ, సత్తుపల్లి ఎంవీఐ శ్రీనివాస్ ఉన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 8 : పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఖమ్మం నగరానికి చెందిన రెబ్బా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సోమవారం పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎన్నిక జరిగింది. 2001 నుంచి 2014వరకు రూరల్ పీఆర్‌టీయూ బాధ్యుడిగా తర్వాత రాష్ట్ర కౌన్సిలర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. ఇప్పుడు రెండోసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం పీఎస్ సీతారామపురం ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నారు. తన నియామకానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ క్రికెట్ టీ-10కు యశ్వంత్‌కుమార్

పెనుబల్లి, అక్టోబర్ 8: మండల పరిధిలోని పాతకుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన వర్దెబోయిన యశ్వంత్‌కుమార్ జాతీయ క్రికెట్ టీ-10కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా తిరువూరు నియోజకవర్గ యాదవ సంఘం హైపవర్ కమిటీ చైర్మన్ మచ్చా శ్రీనివాస్‌యాదవ్, అధ్యక్షుడు యరదేశి రామారావుయాదవ్ యశ్వంత్‌కుమార్‌ను అభినందించి రూ.5,116 నగదు అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

కోట మైసమ్మ ఆలయంలో సత్రం ప్రారంభం

కారేపల్లి, అక్టోబర్ 8: కోట మైసమ్మ దేవస్థానం ఆవరణలో పర్స కృష్ణారావు దమయంతి చారిటబుల్ ట్రస్టు వారు నిర్మించిన సత్రాన్ని దేవాదాయ శాఖ ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎం.వీరస్వామి మంగళవారం ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకొని జాతర ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. జాతరకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరస ఫౌండేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ పట్టాభి రామారావు, పర్స విజయలక్ష్మి, కార్యనిర్వహణాధికారి కే.వేణుగోపాలాచార్యులు, పర్సనల్ సాయి, పగడాల మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చర్యలు చేపట్టాలి

మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

వైరాటౌన్, అక్టోబర్ 8: వైరా మండలంలో ధాన్యం కొనుగోలు ఏర్పాటుకు సంబంధించి మంగళవారం వైరాలో రైతువేదికలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో వైరా తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతి, ఏవో మంజుఖాన్, ఎంపీవో జ్యోత్స్న, ఐకేపీ ఏపీఎం శ్యామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 20 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనువైన సెంటర్లను గుర్తించాలని సూచించారు. ఏఈవోలు, ఐకేపీ సిబ్బంది, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు ఆటల పోటీలు

బాలికలకు బహుమతులు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్

ఖమ్మం రూరల్, అక్టోబర్ 8: మండలంలోని నాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర (యుక్త వయసు) బాలికలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించారు. సెక్టార్ పర్యవేక్షకురాలు శశి షర్మిల ముఖ్య అతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, రన్నింగ్ వంటి పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. టీచర్లు విజయలక్ష్మి, ఉపేంద్రమ్మ, పద్మ, సరోజన, సరిత తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్‌కు గిట్టుబాటు ధర ప్రకటించాలి

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 8: పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ తెలంగాణ పామాయిల్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ అలపాటి రామచందర్‌రావు కోరారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని చల్లగుండ్ల నరసింహారావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి తుమ్మల కృషి ద్వారా పామాయిల్ టన్ను 17 వేలకు పెరిగిందని తెలిపారు. ఈ నెల 12న అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో 33 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 2.5 మెగా యూనిట్ల విద్యుత్ కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి తుమ్మల, కేంద్ర పామాయిల్ శాస్త్రవేత్తలు ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పామాయిల్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి గురువారెడ్డి, డైరెక్టర్ వెంపటి లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మున్సిపల్ కార్మికులకు తీవ్ర గాయాలు

చికిత్స పొందుతున్న కార్మికులు

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 8: మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న ముగ్గురు కార్మికులను లారీ ఢీకొన్న ఘటన మంగళవారం ఉదయం సత్తుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని బాలాజీ థియేటర్ ఎదురుగా పుట్‌పాత్ పక్కన పారిశుధ్య పనులు చేపట్టిన ముగ్గురు కార్మికులను విశాఖపట్నం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో గాంధీనగర్‌కు చెందిన ఇడుములపాటి వెంకటేశ్వరరావు, తడికమళ్ల మరియమ్మ వెంగళరావు నగర్‌కు చెందిన తాళ్ల వెంకటమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముగ్గురు పరిస్థితి నిలకడగా ఉందని ప్రభుత్వ వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గురునాథరెడ్డి

ఎర్రుపాలెం, అక్టోబర్ 8: పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎర్రుపాలేనికి చెందిన జంగా గురునాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వెల్ఫేర్ బోర్డును ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించవద్దు

వేంసూరు, అక్టోబర్ 8: భవన, ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగిస్తే సహించబోమని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం వేంసూరులోని సీఐటీయూ దిమ్మె వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎం.ఎ.రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

వేంసూరు, అక్టోబర్ 8: గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు కల్పించేలాగా బీఎల్‌వోలు చొరవ చూపాలని తహసీల్దార్ ఎం.ఎ.రాజు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నవంబర్ 9, 10 తేదీల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE

★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజ్, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331785-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

టీఎన్‌జీవోస్ మధిర యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

మధిర, అక్టోబర్ 8: కేంద్ర సంఘం ఆదేశానుసారం జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ మధిర యూనిట్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. సీహెచ్ మధు ఎన్నిక అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సింగిల్ సెట్ నామినేషన్లు రావడంతో కార్యవర్గ ఎన్నిక మొత్తం ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా గుర్రం శ్రీనివాసరావు, కార్యదర్శిగా డీవీ సాయికుమార్ ఎన్నికయ్యారు. మరో 12 మంది సభ్యులు ఏకగ్రీవమయ్యారు. జిల్లా కోకన్వీనర్ కొణిదెల శ్రీనివాస్, టీఎన్‌జీవోస్ సభ్యులు కొమరగిరి దుర్గాప్రసాద్, కే.లలితకుమారి, పెద్దినేని రాధాకృష్ణ, టీ.ప్రవీణ్, ప్రకాశ్‌రావు, రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'నాణ్యమైన మంచినీరు సరఫరా చేయడమే లక్ష్యం'

మధిర, అక్టోబర్ 8: ప్రజలకు నాణ్యమైన మంచినీటిని సరఫరా చేయడమే మిషన్ భగీరథ లక్ష్యమని మిషన